క్లుప్తంగా

స్క్రాప్ దుకాణ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి ఆలయ కమాన్ పక్కన గల స్క్రాప్ దుకాణం వల్ల ధ్వని కాలుష్యంతో పాటు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ రాజుకు ఫిర్యాదు చేశారు. రెండేళ్లుగా ధ్వని కాలుష్యంతో నిద్ర, విశ్రాంతి, ప్రశాంతత కోల్పోతున్నామని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే రోడ్డుపై వాహనాలు నిలపడంతో రాకపోకలకు సైతం ఇబ్బంది కలుగుతుందన్నారు. అధికారులు స్పందించి దుకాణ యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలేరు సమన్వయకర్తగా వేణుగోపాల్ యాదవ్



కమ్మర్‌పల్లి: భువనగిరి లోక్‌సభ పరిధిలోని ఆలేరు శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా జిల్లాలోని కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌కు చెందిన టీపీసీసీ అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ నియమితులయ్యారు. గురువారం ఈ మేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలేరు నియోజకవర్గ సమన్వయకర్తగా అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డికి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. భువనగిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విజయం కోసం కృషి చేస్తానని వేణుగోపాల్ యాదవ్ తెలిపారు.

టాలెంట్ టెస్టులో ప్రతిభ



బాల్కొండ: మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎక్స్‌ప్లోర్ టాలెంట్ టెస్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్ తెలిపారు. ప్రతిభా పోటీల్లో రితన్య, శ్రీలాస్య, రక్షన్యాలు ప్రతిభ కనబరిచారన్నారు. ముగ్గురిని బుధవారం సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో సన్మానించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడంపై ఆనందం వ్యక్తం చేశారు.

వైద్య శిబిరానికి స్పందన



బోధన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం బోధన్ శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణ కేంద్రంలోని తహసీల్ ఆఫీసులో గల సంఘ భవనంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి విశ్రాంత ఉద్యోగుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగింది. హైదరాబాద్‌కు చెందిన మెడివిజన్ ఐ కేర్ సెంటర్ వైద్య బృందం హాజరై 40 మంది విశ్రాంత ఉద్యోగులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం డివిజన్ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.రాజేశ్వర్‌రావు, ప్రతినిధులు సాయిలు, నగేష్, మురహరి, ఇస్మాయిల్, బాబురావు, వీరాగౌడ్, అమృత్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



వర్ని: సత్యనారాయణపురం గ్రామ పంచాయతీ పరిధిలో బస్టాండ్ వద్ద పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాలను పంచాయతీ కార్యదర్శి సాయిలు ప్రారంభించారు. వేసవి కాలంలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు సాయిలు వెల్లడించారు. పంచాయతీ కారోబారి మహేష్, రవి పాల్గొన్నారు.

పోతంగల్‌లో..

నవీపేట: పోతంగల్‌లో జీపీ ఆధ్వర్యంలో గురువారం చలి వేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు దోహదం చేస్తాయని ఎంపీవో రామకృష్ణ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందు



రుద్రూర్: ఎత్తొండలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖాదర్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ తయ్యాబ్, మండల నాయకులు రాజు దేశాయ్, శ్రీనివాస్ రావు, వహీద్, మన్సూర్, తజ్ముల్ తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

- ఉపశమనానికి శీతల పానియాలు తాగుతున్న ప్రజలు
- కూలర్లకు పెరిగిన డిమాండ్



శీతల పానియాలు తాగుతున్న ప్రజలు



ప్రధాన చౌరస్తాల వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన కూలర్లు

ఆర్మూర్‌టౌన్: రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్నాయి. ప్రజలు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారు. డీహైడ్రేషన్ నుంచి తప్పించుకోవడానికి విపరీతంగా శీతల పానియాలు తాగుతున్నారు. పట్టణంలో ప్రధాన చౌరస్తా వద్ద శీతల పానియాల దుకాణాలు ప్రజలతో కళకళలాడుతున్నాయి. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు నిమ్మ, చెరుకు రసాలు, ఫ్రూట్ జ్యూస్‌లను సేవిస్తున్నారు. పుచ్చకాయతో పాటు రకరకాల పండ్లు కొనుగోలు చేస్తున్నారు. అలాగే ఇళ్లలో వేడిని తట్టుకోలేక అందుబాటులో ఉన్న కూలర్‌లు కొనుగోలు చేస్తున్నారు. మట్టి కుండల విక్రయాలు సైతం జోరుగా సాగుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రమవుతాయని వాతావరణ శాఖ చెబుతోంది. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో టోపీ, గొడుగు తమ వెంట తీసుకువెళ్లాలని, శీతాల పానీయాలు, ఫ్రూట్స్‌లను స్వీకరిస్తూ ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రజలు ఉదయం 10 లోపు సాయంత్రం 5 గంటల తర్వాత పనులు చేసుకోవాలి.

ఏరియా ఆస్పత్రిలో 24 గంటల ప్రసూతి సేవలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో 24 గంటల ప్రసూతి సేవలు అందిస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ అన్నారు. పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో డివిజన్ స్థాయి వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మాతా శిశు సంరక్షణ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. వివిధ గ్రా మాలలో గర్భిణులతో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సమీక్షలు ఏర్పాటు చేసుకొని ప్ర భుత్వ ఆస్పత్రిలో మాత్రమే డెలివరీ జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. ఆర్మూర్ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి, సీహెచ్‌వో కృష్ణమూర్తి, ఆస్పత్రి వైద్యులు నాగరాజు, స్రవంతి, అపర్ణ పాల్గొన్నారు.

ఈద్గాను పరిశీలించిన ఎమ్మెల్యే



రుద్రూర్: మండల కేంద్రంలోని ఈద్గాను గురువారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. పోచారం స్పీకర్‌గా ఉన్నప్పుడు ఈద్గా పనుల కోసం రూ.10 లక్షల సీడీఎఫ్ నిధులు మంజూరు చేశారు. ఈ నిధులతో ఈద్గా పనులు చేపట్టినట్టు మైనారిటీ నాయకులు పేర్కొంటూ... ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈద్గా నుంచి ప్రధాన రహదారి వరకు సీసీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా వారు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ నరోజి గంగారాం, సింగిల్ విండో చైర్మన్ సంజీవరెడ్డి, విండో డైరెక్టర్ సుభాని, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు దస్తగిరి, అక్కపల్లి నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

అఖండ శివనామ సప్తాహం కరపత్రాల ఆవిష్కరణ

- బోధన్ ఏకచక్రేశ్వరాలయంలో ఈ నెల 20న సప్తాహం ప్రారంభం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్ ప్రతినిధులు

బోధన్: వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్‌ల ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని పురాతన చారిత్రక శ్రీ చక్రేశ్వర శివమందిరం(ఏకచక్రేశ్వరాలయం)లో ఈ నెల 20 నుంచి 27 వరకు 19వ అఖండ శివనామ సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గురువారం పట్టణ కేంద్రంలో సప్తాహం కరపత్రాలను సమాజ్ జిల్లా, పట్టణ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాజ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ఏడు రోజుల పాటు సాగే సప్తాహంలో ఉదయం నుంచి రాత్రి 12 గంటల వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. సమాజ్ ప్రతినిధులు వీఆర్ దేశాయ్, శ్యాంరావు, శివకుమార్ అప్ప, నర్సింగ్ అప్ప, లక్ష్మణ్ పటేల్, రాజేందర్ అప్ప, శంకర్‌అప్ప, యాదవ రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

సీతారామాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన



మాక్లూర్: మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయంలో గురువారం వందలాది మంది భక్తుల మధ్య శ్రీలక్ష్మణ సహిత, సీతారామాంజనేయ స్వామి విగ్రహాలను హంపి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీ విద్యారణ్యభారతీ స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠించారు. ప్రధానంగా ఆలయ నిర్మాణానికి సింహభాగం విరాళం ఇచ్చిన నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తాను గ్రామస్తులు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. హంపి పీఠాధిపతి ప్రత్యేక యజ్ఞం అనంతరం ఆలయానికి శిఖరాన్ని అమర్చారు. అనంతరం ధ్వజస్తంభం నెలకొల్పి ఆలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. కార్యక్రమానికి ఎంపీ ధర్మపురి అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డిలు హాజరయ్యారు. రాకేష్‌రెడ్డి, వినయ్‌రెడ్డిల వర్గాలు ఒకరిని మించి ఒకరు నినాదాలు చేసుకోవటంతో కొద్ది సేపు తోపులాట జరిగింది.

లక్ష్మీపూర్ క్యాంపులో ..

రుద్రూర్: అంబం(ఆర్) జీపీ పరిధిలోని లక్ష్మీపూర్ క్యాంపులో నూతనంగా నిర్మించిన శ్రీ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ప్రారంభమైన ప్రతిష్ఠాపన కార్యక్రమాలు శుక్రవారం వరకు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.



బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన



మాక్లూర్: ఒడ్డేట్‌పల్లిలో కురుమ కులస్తులు నూతనంగా నిర్మించుకున్న బీరప్ప ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. కార్యక్రమానికి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి హాజరై వారితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కుల పెద్దలు రామడోళ్ల ప్రవీణ్, రాజేశ్వర్, ఒడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి మాస కల్యాణోత్సవం



బోధన్‌రూరల్(బోధన్): పట్టణంలోని వేంకటేశ్వర కాలనీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాస కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయంలో ఆలయ అర్చకులు దీపక్ పాండే ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి శ్రీలక్ష్మీ గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి మాస కల్యాణం నిర్వహించారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ



మామిడిపల్లిలో వ్యాపారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న వైద్యాధికారిణి ప్రీతి

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను చిరు వ్యాపారులకు బస్తీ దవాఖానా వైద్యాధికారిణి ప్రీతి పావని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో అవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని సూచించారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లే వారు తలకు నేరుగా ఎండ తగలకుండా జాగ్రత్త పడాలన్నారు. వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అతి ఉష్ణోగ్రతల వల్ల శరీరంలో నుంచి నీరు చెమట రూపంలో బయటకు వెళ్లిపోవడంతో శక్తి హీనులవుతారన్నారు. ఓఆర్‌ఎస్ తాగడం వల్ల కోల్పోయిన శక్తిని తిరిగి పొందవచ్చన్నారు. ఆరోగ్య కార్యకర్త జక్కుల మోహన్, స్టాఫ్ నర్స్ స్రవంతి, ఆశా కార్యకర్తలు మమత, సుభద్ర, రమ పాల్గొన్నారు.

పసుపు బోర్డుపై రాజకీయం చేయొద్దు



మాట్లాడుతున్న బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, కార్పొరేటర్లు

సుభాష్‌నగర్: పసుపుబోర్డు కార్యాలయం జిల్లాలో ఏర్పాటు చేయడం ఖాయమని, కాంగ్రెస్ నాయకులు పసుపు బోర్డుపై రాజకీయం చేయొద్దని బీజేపీ నిజామాబాద్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గోపిడి స్రవంతి రెడ్డి హితవు పలికారు. దేశవ్యాప్తంగా పసుపు రైతులకు మంచి ధర వస్తే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి, పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. ప్రధాని మోదీ స్వయంగా పసుపు బోర్డు ప్రకటించారని, గెజిట్ నోటిఫికేషన్, రాష్ట్రపతి ఉత్తర్వులు కూడా ఇచ్చారని గుర్తు చేశారు. ఈవిషయంలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలతోపాటు పసుపు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీగా జీవన్‌రెడ్డి జిల్లాకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జగిత్యాలలను పీఎఫ్ఐ, రోహింగ్యాలకు అడ్డాగా మార్చారని ఆరోపించారు. చెరుకు ఫ్యాక్టరీలు మూత పడటానికి కాంగ్రెస్, జీవన్‌రెడ్డి కారణమన్నారు. సీఏఏ, ఎన్ఆర్‌సీని ఎందుకు వ్యతిరేకిస్తున్నారని, కేవలం ముస్లింల ఓట్ల కోసమేనా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు, జీవన్‌రెడ్డికి వయస్సు అయిపోయిందని, విశ్రాంతి తీసుకోవాలని హితవు పలికారు. కార్పొరేటర్లు ప్రవళిక, హేమలత, సుమిత్రదేవి కిషోర్, వనిత,లావణ్య, తదితరులున్నారు.

నిలిచిన పోస్టుమార్టం సేవలు!

- బాల్కొండ సీహెచ్‌సీలో..
- ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి మృతదేహాల తరలింపు
- ఇబ్బంది పడుతున్న మృతుల బంధువులు



బాల్కొండ మండల కేంద్రంలో ప్రభుత్వాస్పత్రి

బాల్కొండ: బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో నాలుగు నెలల నుంచి పోస్టుమార్టం సేవలు సాగడం లేదు. దీంతో మృత దేహాలను పోస్టు మార్టం కోసం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నారు. జిల్లా సరిహద్దు ప్రాంతం అయిన మెండోరా మండలం దూదిగాం లాంటి గ్రామాల నుంచి ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి పంపించాలంటే దూర భారం ఎక్కువ అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే మరణించిన దుఃఖంలో కుటుంబ సభ్యులుంటే దూర భారాన్ని భరించి, అంత దూరం పంపడం అంటే ప్రజలకు ఇబ్బందులకు గురి చేసినట్లే అవుతుంది. బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో కొన్నాళ్లుగా పోస్టు మార్టం నిర్వహిస్తున్నారు. పోస్టు మార్టం కోసం ప్రత్యేక గది కూడ ఉంది. కానీ ఇక్కడ పోస్టు మార్టం సేవలు చేపట్టకుండా ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నారు. ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రిలో ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యుడు అందుబాటులో ఉండటం వలనే అక్కడికి తరలిస్తున్నట్లు వైద్యులు పేర్కొంటున్నారు. కాని ఇన్నాళ్లుగా ఇక్కడ ఎంబీబీఎస్ వైద్యునితో పోస్టు మార్టం ఎందుకు చేయించారు అంటే అర్థం లేని సమాధానాలు చెబుతున్నారు. ఇప్పుడు ఫోరెన్సిక్ పేరుతో ఎందుకు ఆర్మూర్ తరలిస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పేరుకే వైద్యావిధాన పరిషత్..

బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రి క్లస్టర్ ఆస్పత్రి. రెండేళ్ల క్రితం డీఎంహెచ్‌వో నుంచి ఆస్పత్రిని వైద్యావిధాన పరిషత్‌కు అప్పగించారు. ఆస్పత్రి వైద్యా విధాన పరిషత్‌కు అప్పగింత మాత్రమే జరిగింది. ఇప్పటికీ పూర్తి స్థాయిలో వైద్యులు లేరు. బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో ప్రస్తుతం ఒక దంత వైద్యుడు, ఒక ఎంబీబీఎస్ వైద్యురాలు, ఆయుష్ వైద్యుడు ఉన్నారు. గైనకాలజిస్టు, మత్తు వైద్యురాలు డిప్యుటేషన్‌పై వారానికి రెండు రోజులు వచ్చి సేవలను అందిస్తున్నారు. ఇక్కడ ఎంబీబీఎస్ వైద్యుడు ఉన్నంత కాలం పోస్టు మార్టం నిర్వహించారు. ప్రస్తుతం పోస్టు మార్టం చేయడానికి కూడా వైద్యులు లేకనే ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తున్నారు. కానీ ఫోరెన్సిక్ పేరుతో తప్పించుకుంటున్నారు. ఉన్నత అధికారులు స్పందించి పోస్టు మార్టం సేవలు బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలోనే అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్మూర్‌కే తరలించమంటున్నారు

మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించాలని ఉన్నత అధికారులు సూచించడంతో అక్కడికే పంపిస్తున్నాం. బాల్కొండలో సేవలు అందించటానికి సిద్ధంగా ఉన్నాం. – అనిల్, వైద్యాధికారి, బాల్కొండ

భూ కబ్జాలను అడ్డుకోవాలి



బాల్కొండ: మండల కేంద్రంలోని భవానీ కాలనీ సర్వే నంబరు–147లో ప్రభుత్వ భూమి కబ్జాను అడ్డుకోవాలని కాలనీవాసులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలి వచ్చారు. కాలనీ ఏర్పాటు కాలంలో లేఅవుట్ ప్రకారం గ్రామ పంచాయతీకి కేటాయించిన 10 శాతం భూమిని ప్రస్తుతం కొందరు రియల్టర్లు కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. భూ కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

మామిడి తోటల వేలం

రుద్రూర్: రుద్రూర్ మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని మామిడి తోటలకు గురువారం వేలం పాట నిర్వహించారు. దీనికి 22 మంది ఔత్సాహికులు హాజరయ్యారు. కృషి విజ్ఞాన కేంద్రం మామిడి తోటను రూ.2 లక్షల 3 వేలు, వ్యవసాయ కేంద్రానికి చెందిన తోటను రూ.లక్షా 82 వేలకు సుధాకర్ రావ్, హబీబ్ ఖాన్ దక్కించుకున్నారు.

ఐపీఈతో గిరిరాజ్ కళాశాల ఒప్పందం

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ కళాశాలలోని వాణిజ్య శాస్త్ర విభాగం గురువారం హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపీఈ)తో ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా కళాశాల విద్యార్థులకు అధ్యాపకులకు పరిశోధనకు సంబంధించి సెలబస్‌లో మార్పులు చేర్పులు, ఇంటర్న్‌షిప్‌కు అవకాశం ఉంటుందని ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ లింగన్న, ఐపీఈ ప్రతినిధులు శ్రీనివాసమూర్తి రామకృష్ణ ఉన్నారు .

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించిన విద్యార్థిని సౌజన్య



సౌజన్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థిని సౌజన్య జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ సవిత తెలిపారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో మార్చి 27 నుంచి ఏప్రిల్ 1వరకు జరిగిన జాతీయ స్థాయి అండర్–14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి జట్టు విజయం సాధించడంలో కృషి చేస్తుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని సౌజన్యను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ స్వప్న, పీఈటీ భాగ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

పశువులకు వ్యాధి నివారణ టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్యులు

మాక్లూర్: బోర్గాం(కె)లో గురువారం మండల పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో పశువైద్య సిబ్బంది పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామాలవారీగా వేస్తున్న టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యులు కిరణ్ దేశ్‌పాండే, ఉమా సహేర్‌లు తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది గంగాజమున, శ్రీనివాస్, వినీత, పుష్ప, గంగాధర్, సుధీర్, జైల్‌సింగ్, లక్ష్మిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



రుద్రూర్: సులేమాన్‌నగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గురువారం సాయంత్రం బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు పార్టీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్ కుమార్, ఎంపీటీసీ గౌస్, మాజీ సర్పంచ్ మహ్మద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు హైమద్ తదితరులు పాల్గొన్నారు.


సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 11.20, 4.45, 10.10; భరతనాట్యం - 2.00, 7.25
- స్క్రీన్-2 – టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.20, 1.20, 4.20, 7.20, 10.20
- స్క్రీన్-3 – ది గోట్ లైఫ్ (తెలుగు) - 11.25, 2.40, 6.15, 9.40
- స్క్రీన్-4 – ది ఫ్యామిలీ స్టార్ -11.25, 2.50, 6.15, 9.40

క్షత్రియలో ప్రాంగణ నియామకాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పెర్కిట్(ఆర్మూర్): చేపూర్ క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం హైదరాబాద్‌కు చెందిన క్యూ స్పైడర్ కంపెనీ ఆధ్వర్యంలో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు యామిని, శ్రావ్య, ప్రియాంక కోలార్‌లు నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆప్టిట్యూడ్ టెస్టు, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 22 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఆర్‌కే పాండే, టీపీవో సునీల్ గటడి, తదితరులు పాల్గొన్నారు.